క్లుప్తంగా

డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీ



సంగెం: స్థానిక గ్రామీణ కుటుంబ సంక్షేమ కేంద్రాన్ని (ఆర్ఎఫ్‌డబ్ల్యూసీ) డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమయాపాలన పాటించాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, వైద్యులు దేవేందర్, క్రాంతి, లావణ్య, రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

రాయపర్తి : పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని నియోజకవర్గానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆమెను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు పెద్దగాని సోమన్న గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. తొలుత ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలో లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. త్వరితగతిన పూర్తి చేయాలని, నిబంధనల మేరకు 400–600 చదరపు అడుగుల వరకు ఉండేలా నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, కారోబార్ మేడిశెట్టి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ



గీసుకొండ : మండలంలోని కొమ్మాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు హనుమకొండకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ ట్రై సిటీ ప్రతినిధులు సోమవారం టై, బెల్టు, పరీక్ష ప్యాడ్, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం పాడి రాజు, క్లబ్ సభ్యులు రహమాన్, హరికిషన్ రెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలపై కేసు నమోదు

సంగెం : కత్తితో పొడిచిన భర్తతోపాటుగా బూతులు తిట్టిన భార్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వివరాలిలా.. ఈనెల 12న మండలంలోని గవిచర్లకు చెందిన గూడ రాజిరెడ్డికి, కొంతం ప్రసాద్‌కు మధ్య గొడవ జరిగింది. తన స్థలంలో హద్దుదాటి గోడ కట్టావని ప్రసాద్‌ను రాజిరెడ్డి నిలదీయడంతో రాజిరెడ్డిని ప్రసాద్ కత్తితో చేతిపై పొడవగా సంధ్య బూతులు తిట్టింది. రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'బెదిరింపులకు పాల్పడలేదు'

సంగెం : మండలంలోని కాట్రపల్లికి చెందిన గాయపు వీరారెడ్డి కుటుంబంపై బెదిరింపులకు పాల్పడలేదని అదే గ్రామానికి చెందిన గాయపు రవీందర్‌రెడ్డి ఉమాదేవి దంపతులు తెలిపారు. రవీందర్‌రెడ్డి దంపతులు విలేకరులతో సోమవారం మాట్లాడారు. తమకు రావాల్సిన భూమి కోసం అడుగుతున్నట్లు తెలిపారు. ప్రాణహాని ఉందని వీరారెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. తమకు రావాల్సిన భూమి కర్ర లింగారెడ్డి నుంచి పట్టా చేయించాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



పర్వతగిరి : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. కౌలు రైతు రంగు కుమారస్వామి పొలంలో నాటు వేసే సమయంలో గొర్రు తోలుతుండగా ప్రమాదవశాత్తు అతడి ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని కుమారస్వామి చెప్పారు. ప్రభుత్వం తనను పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

ఇంటింటా జ్వర సర్వే

- ఆశవర్కర్లు, ఏఎన్ఎంలతో వివరాల సేకరణ
- పీడితుల గుర్తింపు, నివాసాల్లోనే చికిత్స



సర్వే చేస్తున్న ఏఎన్ఎం, ఆశ కార్యకర్త

దుగ్గొండి : మండలంలో సీజనల్ వ్యాధుల నివారణ దిశగా వైద్యశాఖ సర్వే చేపట్టింది. మండలంలోని దుగ్గొండి, కేశవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తూ జ్వరపీడితులను గుర్తిస్తుండగా బాధితులకు ఇళ్ల వద్దే వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారు. డెంగీ, మలేరియా, తదితర విష జ్వరాలతోపాటు సీజనల్ వ్యాధులను కట్టడి చేసే దిశగా కార్యాచరణ సాగుతోంది.

మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 15 వేల 435 కుటుంబాలకు చెందిన 42 వేల 50 మంది జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మండలంలోని దుగ్గొండి, కేశవాపురం పీహెచ్‌సీల పరిధిలో 14 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో 9 మంది వైద్యులు, నలుగురు హెల్త్ సూపర్‌వైజర్లు, నలుగురు హెల్త్ అసిస్టెంట్లు, 13 మంది ఏఎన్ఎంలు, 38 మంది ఆశ వర్కర్లు బృందాలుగా ఏర్పడి జ్వర సర్వే చేస్తున్నారు. ఇంట్లో జ్వరపీడితులున్నారా? ఎంతకాలం నుంచి బాధపడుతున్నారు? వైద్యం ఏమైనా చేయించుకుంటున్నారా? తదితర వివరాలు సేకరిస్తూనే అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ సూదులు వేస్తున్నారు. మందులు అందిస్తున్నారు. విషజ్వరాల తీవ్రతతో ఇబ్బంది పడుతున్న రోగగ్రస్తులను మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం, ఇతర ఉన్నత శ్రేణి ఆస్పత్రులకు తరలిస్తున్నారు. రక్తనమూనాలు సేకరించి పరీక్షా కేంద్రాలకు పంపిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచిస్తూనే దోమల నివారణపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నారు.

జ్వర సర్వేతో కట్టడి



సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని పల్లెల్లో జ్వర సర్వే నిర్వహిస్తున్నాం. జ్వర పీడితులను గుర్తిస్తూ ఇళ్ల వద్దే వైద్యసేవలు అందిస్తున్నాం. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. దోమల నివారణ, పరిసరాల శుభ్రతపై చైతన్యవంతం చేస్తున్నాం. వ్యాధుల తీవ్రతతో ఇబ్బంది పడుతున్న వారిని ఉన్నత శ్రేణి ఆస్పత్రులకు పంపుతున్నాం.

- కిరణ్ రాజ్, వైద్యాధికారి, దుగ్గొండి

'మిషన్ భగీరథ' లీకేజీపై నిర్లక్ష్యం



రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు

- వృథాగా పోతున్న దుస్థితి

నర్సంపేట : అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్ల పైపులు పగిలి రోడ్లపై తాగునీరు వృథాపోతోంది. ప్రజలకు రెండ్రోజులకోసారి తాగునీరు అందుతుండగా అరకొరగా ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులు పగిలిపోవడానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని విమర్శలున్నాయి. మెయిన్ పైపులైన్ నుంచి ఇళ్లకు వేసిన పైపులు పైనపైన వేసి సీసీ పోయడంతో వాహనాల రాకపోకలకు అవి పగిలిపోతున్నాయి. వల్లబ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో కొన్నేళ్లుగా పైపులైన్ పగిలి ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తోంది. నెక్కొండ రోడ్డులోని శాంతినగర్, ద్వారకపేట కాలనీలతోపాటు పలు వార్డుల్లో పైపులైన్లు పగిలి నీరు వృథా పోతున్న పరిస్థితి నెలకొంది. మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు స్పందించి పగిలిన పైపులకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పుతో అధికార పార్టీ నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాకు అత్యంత ప్రాధాన్యత ఉండగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ ఎమ్మెల్యేల తీరుతో ప్రాధాన్యత తగ్గిందన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మార్పు పేరుతో రద్దు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ నెలకొందని, సొంత కాంట్రాక్ట్ పనుల కోసం పాత పనులను రద్దు చేసి వాటినే కొత్తగా మంజూరు చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. లీగల్ అగ్రిమెంట్ చేసిన పనులను ఎందుకు రద్దు చేస్తున్నారని ప్రశ్నించారు. రెండో విడత పరిహారం కోసం గతంలో మంజూరు చేసిన నిధులు విడుదల చేయించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు మట్టి దందాలో వాటాదారులుగా ఉన్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రెండేళ్లలో ఎమ్మెల్యే రద్దు చేయించిన పనులు, అధికార పార్టీ నాయకుల అరాచకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి (ఆర్ఎస్ఎస్) రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మైదాకు మురిపెం..



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని కమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు గోరింట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తమ లేత చేతులకు మైదాకు పెట్టుకుని మురిసిపోయారు. ఎర్రగా పండిన అరచేతులను స్నేహితులకు చూపెట్టి ఆనందపడ్డారు. ఈ సందర్భంగా గోరింటాకు, తద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే సర్దార్, ఉపాధ్యాయులు కొంగర కవిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కందాల చంద్రమౌళి ఆధ్వర్యంలో పాపయ్యపేట, అమృతండాకు చెందిన కోరె మల్లేషం, మెరుగు స్వామి, మెరుగు రాములు, మెరుగు నవీన్, లావుడ్య రమేశ్, తేజావత్ సురేశ్, బోడ కృష్ణ, బోడ లక్ష్మణ్, బోడ సాగర్, బోడ వెంకన్న, బోడ శ్రీను, తదితరులు సోమవారం బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వమే పేదలకు రేషన్ బియ్యం, రైతులకు యూరియాతోపాటు పెట్టుబడి సాయం అందిస్తోందని తెలిపారు. గ్రామాల్లో స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, తదితరాలకు సైతం కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దామరపుల శేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంక దువ్వ రంజిత్, సీనియర్ నాయకుడు మల్లయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, మండల ప్రధాన కార్యదర్శి విజయ్, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, బూత్ కమిటీ అధ్యక్షులు ఉప్పలయ్య, మెరుగు యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపించండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట : మండలంలో నాచినపల్లి నుంచి పానకల్, లక్నేపల్లి నుంచి మల్లంపల్లి, నర్సంపేట నుంచి ధర్మరావుపేట, చంద్రయ్యపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం ప్రశాంత్ మాట్లాడారు. స్కూళ్లు, కాలేజీలు తెరుచుకుని నెల రోజులు గడిచినా పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు రాలేని దుస్థితి నెలకొందన్నారు. విద్యార్థులు ఆర్టీసీ బస్సు లేక, ప్రైవేట్ వాహనాల ఛార్జీలు భరించలేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గతంలో సదరు రూట్లలో బస్సులు నడిపించారని గుర్తు చేశారు. ఇకనైనా వెంటనే బస్సులు నడిపించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేశ్, నాయకులు సుమన్, కిరణ్, సుశాంత్, నాగచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం'



నల్లబెల్లి : మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దూరి తిరుపతిరావు కోరారు. మండలంలోని నందిగామ, రేలకుంట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా తిరుపతిరావును ఆయా గ్రామాల్లో శాలువాతో సన్మానించారు.

భూసార పరిరక్షణ సామాజిక బాధ్యత



గీసుకొండ : డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీ విధానాన్ని వివరిస్తున్న ఏఓ హరిప్రసాద్

- ఏఓలు కృష్ణకుమార్, శ్రీనివాస్

నర్సంపేట/ఖానాపురం/పర్వతగిరి/గీసుకొండ : భూసార పరిరక్షణను రైతులు సామాజిక బాధ్యతగా భావించాలని నర్సంపేట, ఖానాపురం, పర్వతగిరి, గీసుకొండ ఏఓలు కృష్ణకుమార్, శ్రీనివాస్, ప్రశాంత్‌కుమార్, హరిప్రసాద్ ఆకాంక్షించారు. ఆయా మండలాల్లో సోమవారం నిర్వహించిన ఏరువాక సాగుబడి కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. వివిధ పంటల సాగులో చేపట్టిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అవసరం మేరకు యూరియా వాడాలన్నారు. నానో ఎరువులు వినియోగిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడంతోపాటు భూసారాన్ని పరిరక్షించొచ్చని చెప్పారు.

పంట చేలలో శాస్త్రవేత్తల పరిశీలన

గీసుకొండ మండలంలోని కోనాయమాకులలోని పంట చేలను డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగభూషణం, శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ విశ్వతేజ పరిశీలించారు. చీడ పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు కాండానికి బొట్టుపెట్టే పద్ధతి పాటించాలని చెప్పారు. మొక్కజొన్న చేలలో కత్తెర పురుగు నివారణ చర్యలను వివరించారు.

'గోదాం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి'



అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న స్థానికులు

నెక్కొండ : మండలంలోని చల్లా గోదాముల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో స్థానికులు సోమవారం ధర్నా చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. గోదాముల నుంచి వస్తున్న లక్క పురుగులతో ఆరోగ్యం దెబ్బతింటోందని వాపోయారు. లక్క పురుగుల ఉధృతిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. లక్క పురుగుల ఉధృతితో కంటి మీద కునుకు ఉండడం లేదన్నారు. గోదాముల నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. లక్క పురుగుల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ ఈఓ సదానందంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు దాసరి శ్రీనివాస్, పలుసం పూర్ణచందర్, తాటిపెల్లి శివకుమార్, కారింగుల సురేశ్, నవీన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో పాల్గొనాలి



నల్లబెల్లి : వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని ఏంఈఓ అనురాధ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆమె మొక్కలు నాటి నీళ్లు పోసి మాట్లాడారు. వనమహోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు రాంబాబు, భద్రీనాథ్, శోభారాణి, గోవర్ధన్, సీఆర్‌పీ రవి తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ' కార్యాలయంపై దాడి సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

- మెపా రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్

నర్సంపేట : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయాలపై తెలంగాణ జాగృతి నాయకులు దాడి చేయడం సరికాదని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో దేవేందర్ మాట్లాడారు. దాడిని ప్రజలు ఖండించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, గౌరవ సలహాదార్లు పులి ప్రభాకర్, నీరటి రాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం

వర్ధన్నపేట : ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ తీన్మార్‌కు చెందిన కార్యాలయాలపై తెలంగాణ జాగృతి దాడి నేపథ్యంలో ఎమ్మెల్సీన కల్వకుంట్ల కవిత దిష్టిబొమ్మను పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో తీన్మార్ మల్లన్న టీమ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దహనం చేసి ధర్నా చేపట్టారు. అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీమ్ మండల కమిటీ అధ్యక్షుడు ఆకుల మనోజ్, బీసీ ఐక్య వేదిక నాయకులు పూజారి రాజు, ఆరెల్లి నాగార్జున, ఆవుల ప్రవీణ్, నోముల గౌరవ్, గాడిపెల్లి యాకన్న, నవీన్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించాలి



నర్సంపేట : విద్యార్థులు పుట్టిన రోజుల సందర్భంగా మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు కోరారు. ఆ స్కూల్ విద్యార్థులు 'మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి' నినాదంతో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి వరంగల్ రోడ్డు చౌరస్తా వరకు సోమవారం నిర్వహించిన గ్రీన్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ కాలుష్యం పెరిగి భవిష్యత్తులో పీల్చే గాలిని సైతం కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్, పూర్ణచందర్, రాజు, రాధా, వీరన్న, అజయ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మొద్దు సదానందం ఆదివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి రైతు సమన్వయ సమితి (ఆర్ఎస్ఎస్) రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ సోమవారం నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడైన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మొద్దు వేణును పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు, నాయకులు నాగిశెట్టి ప్రసాద్, మండల శ్రీనివాస్, దుశ్యంత్‌రెడ్డి, అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో

వర్ధన్నపేట : పట్టణంలోని 10వ వార్డుకు చెందిన కంజర్ల నాగమణి మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, నాయకులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిల్ సభ్యులు సమ్మెట సుధీర్, అన్వర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాయకుడి మృతి

ఖానాపురం : మండలంలోని దబ్బీరుపేటకు చెందిన ఎంసీపీఐ(యూ) సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ అకారపు మల్లయ్య సోమవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్లయ్య అందించిన సేవలను కొనియాడారు. సర్పంచ్‌గా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కలకోట్ల యాదగిరి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాషుక్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవిని అతడి తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, ముదిరాజ్ మహాసభ ఎస్ఆర్ఐ విభాగం కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, స్వామి, తిరుపతి, రవి, నర్సింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని ఊకల్‌కు చెందిన పాల సోమయ్య, పాలెపాక ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి రూ.3 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మధు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి



గీసుకొండ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కనకం సంధ్య డిమాండ్ చేశారు. ఆమె ఆధ్వర్యంలోని బృందం ఆస్పత్రిని సోమవారం సందర్శించి వసతులు, వైద్యసేవలను పరిశీలించింది. అనంతరం సంధ్య మాట్లాడారు. ఆస్పత్రిలో పడకలను పెంచాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, అవసరమైన నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు జట్టు రేణుక, పెండ్యాల లలిత, యమున, చీర శాంత, విజయ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి'



నినాదాలు చేస్తున్న అనిమిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

రాయపర్తి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. మండలంలోని జింకురాంతండాలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ధూమ్‌సింగ్, మాజీ సర్పంచ్ గుగులోతు సుందర్‌నాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో అనిమిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అండదండలు ఉంటాయన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలంటూ నినాదాలు చేశారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎంటీటీసీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కర్ర రవీందర్‌రెడ్డి, నాయకులు ఎల్లస్వామి, గుగులోతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.